క్లుప్తంగా

నల్లమల ప్రాంతానికి రక్షణ కవచం వాచ్ టవర్



లింగాల: నల్లమల అటవీ ప్రాంతానికి వాచ్ టవర్ రక్షణ కవచంగా ఉంటుందని అటవీ శాఖ సీసీఎఫ్ శివాని దోగ్రా అన్నారు. లింగాల మండలంలోని నల్లమల ప్రాంతంలో నూతనంగా నిర్మించిన వాచ్ టవర్‌ను బుధవారం ఎఫ్‌డీఓ తిరుమలరావుతో కలిసి సీసీఎఫ్ సందర్శించారు. ఈ సందర్భంగా టవర్ నుంచి నల్లమల అందాలను తిలకించారు. అనంతరం సీసీఎఫ్ మాట్లాడుతూ.. ఆధునిక కెమెరాలను అమర్చిన వాచ్ టవర్ నుంచి కొన్ని కిలోమీటర్ల మేర నల్లమల ప్రాంతాన్ని చూడవచ్చన్నారు. అటవీ ప్రాంతంలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించడాన్ని గమనించే సదుపాయం ఉందని అన్నారు. నల్లమల ప్రాంతానికి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అటవీ ప్రాంతాన్ని నాశనం చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌పీ రామ్మోహన్, ఎఫ్ఆర్‌ఓ సుబూర్, భౌరమ్మ, డీఆర్‌ఓ జయదేవ్, బీట్ ఆఫీసర్లు ఖాదర్‌పాషా, శివాజీ పాల్గొన్నారు.

చిన్నారికి చేయూత



కల్వకుర్తిరూరల్: మండలంలోని తుర్కలపల్లి గ్రామానికి చెందిన నాలుగేళ్ల మూగ బాలిక చిటికెల అక్షితకు వైద్య ఖర్చుల నిమిత్తం బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేష్ రూ.15 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, శేఖర్ యాదవ్, రమేశ్, గణేష్, తుర్కలపల్లి గ్రామస్తులు రామకృష్ణ, శేఖర్‌గౌడ్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎక్సైజ్ దాడులు

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి ఎక్సైజ్ పరిధిలోని దేవునితండా, అన్నారం తండా, రంగాపూర్ గ్రామంలో బుధవారం పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. తర్నికల్ తండా నుంచి వెంకటాపూర్ గ్రామానికి అక్రమంగా 12 లీటర్ల సార తరలిస్తున్న రాజు అరెస్టు చేసి ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసులు నమోదు చేశారు. కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి, డీపీఎస్ సీఐ రాజ్యలక్ష్మి, సిబ్బంది మాధవి, నారియా, పరశురాం, తిరుపతిరెడ్డి, మహేష్, పాల్గొన్నారు.

విద్యార్థులకు షూ పంపిణీ



వెల్దండ: మండలంలోని రాచూర్ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం శ్రేష్ఠ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్యాంపూరి రవీందర్‌రెడ్డి విద్యార్థులకు షూలను పంపిణీ చేశారు. ప్రభుత్వం పాఠశాలల్లోని విద్యార్థులకు తనవంతుగా వ్యక్తిగతంగా షూలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలను ప్రైవేట్‌కు దీటుగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకట్‌రెడ్డి, నాయకులు జంగయ్య, రాధకిషన్‌గౌడ్, తాజుదీన్, రాజు, రమేష్, ఉమ్మర్‌పాషా, రాజు, బాబు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

స్థానికులనే డీలర్‌గా నియమించాలని వినతి

వెల్దండ: మండలంలోని బైరాపూర్ రేషన్‌దుకాణం డీలర్‌ను స్థానికులనే నియమించాలని కోరుతూ బుధవారం గ్రామస్తులు రేషన్‌దుకాణం వద్ద ఆందోళన చేపట్టారు. బైరాపూర్‌లో డీలర్ పోస్ట్ ఖాళీగా ఉందని గ్రామానికి చెందిన వ్యక్తినే నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్హత లేని గణపతిని డీలర్‌గా ఎలా నియమిస్తారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్‌దుకాణాన్ని మూసివేయించారు. అనంతరం వెల్దండ తహసీల్దార్ రవికుమార్‌కు, కల్వకుర్తి ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీనునాయక్ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యాదమ్మ, జంగయ్య, వెంకటయ్య, నిరంజన్, శ్రీను, వెంకటయ్య గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

అఖండ భారత్ ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

అచ్చంపేట: అఖండ భారత్ ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆ సంఘం బౌద్ధిక్ ప్రముఖ కట్ట సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో అఖండ భారత దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య వీరుల స్ఫూర్తితో యువత దేశ సమైక్యతను కాపాడాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్ నాయక్, పురం వెంకటేష్, నాగరాజు, మోక్తాల శంకుతల, పవన్‌కుమార్, శ్రీనివాస్‌గౌడు, లక్ష్మన్, జబ్బుసాయిబాబు, రాజగిరి వెంకటేష్, రాకేష్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థలకు చేయూతనిస్తాం



విద్యార్థులకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: స్వచ్ఛంద సంస్థలకు చేయూతనిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించేందుకు స్వచ్ఛంద సంస్థలు చేసే కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారం ఎల్లప్పుడూ అందిస్తానన్నారు. రాబోయే కాలంలో ప్రోత్సాహకాలను పొందేందుకు విద్యార్థులు పోటీపడి విద్యను అభ్యసించాలని ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయని, విద్యార్థులు చెట్ల కింద విద్యను అభ్యసిస్తున్నారని, త్వరలో నూతన భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. పాఠశాలల నిర్మాణాలకు మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన పథకంలో సహపంక్తి భోజనం చేశారు. వాసా రాఘవేందర్, కావలి శ్రీను, సునేంద్ర, బచ్చన్న యాదవ్ పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట: ప్రజా ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన వైద్య, ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు సకాలంలో వైద్యం చేయాలన్నారు. ప్రజా ఆరోగ్యం కోసం అవసరమైన నిధులు ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి స్వరాజలక్ష్మి, డాక్టర్ రామకృష్ణ వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అంతరాయం లేని విద్యుత్ అందిస్తాం..

నియోజకవర్గంలో అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. విద్యుత్ లోఓల్టేజీ సమస్యను అధిగమించేందుకు నూతనంగా ఆరు సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు చెప్పారు. లింగాల మండలం బాకారం, ఉప్పునుంతల మండలం కంసానిపల్లి, అచ్చంపేట మండలం సింగారం, పదర మండల కేంద్రం, వంగూరు మండలం ఉల్పరకు సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయన్నారు. అమ్రాబాద్ మండలం మొల్కమామిడి లేదా మాచారం గ్రామాల మధ్య 220/33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలం ఎంపిక జరుగుతుందన్నారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. లోఓల్టేజీ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని వచ్చారని, రూ.32 వేల కోట్ల అభివృద్ధి పనులకు విదేశీ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని వచ్చారన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా ఉమామహేశ్వర లిఫ్టుకు శంకుస్థాపన చేస్తారని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు నర్సింహరావు, కట్టా అనంతరెడ్డి, మల్‌రెడ్డి వెంకట్‌రెడ్డి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న ఆర్ శ్రీనివాసులు

నాగర్‌కర్నూల్‌రూరల్: అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి కందికొండ గీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో శాంతియుతంగా నిర్వహిస్తున్న దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల బలోపేతం కోసం అహర్నిషలు గెస్టు టీచర్లు శ్రమిస్తున్నారన్నారు. వారి న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 13 ఏళ్లుగా 1654 మంది గెస్టు లెక్చరర్లు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అశోక్, రాష్ట్ర నాయకులు సదానందంగౌడ్, అధ్యక్ష కార్యదర్శులు కావలి కృష్ణ, రవీందర్‌రెడ్డి, రామారావు, భీమేష్, బాల్‌రాజు, కుర్మయ్య, స్వర్ణలత, శివలీల, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి



చారకొండ: ముదిరాజ్‌ల అభివృద్ధికి కృషి చేస్తానని జెడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్ అన్నారు. మండలంలోని చంద్రాయన్‌పల్లిలో బుధవారం ముదిరాజ్ సంఘం నూతన భవన నిర్మాణానికి కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు ఆశాదీప్‌రెడ్డితో కలిసి ఆయన భూమి పూజ పనులు ప్రారంభించారు. బాలాజీ సింగ్ రూ.లక్ష, ఆశాదీప్ రెడ్డి రూ.1.50 లక్షల విలువ గల స్టీల్, సిమెంట్ అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాంబయ్య గౌడ్, పర్వతాలు, భాస్కర్ రెడ్డి, శంకర్ సంఘం అధ్యక్షుడు సొప్పరి వెంకటయ్య, సంఘం సభ్యులు శ్రీను మాణిక్యం, చరణ్, శంకర్, బాల్‌చంద్రి గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు పూర్తి



లింగాల మండలం అప్పాయిపల్లిలో ..



కల్వకుర్తిలో జాతీయ జెండాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిప్యూటీ తహసీల్దార్ మహమ్మద్‌అలీ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన కార్యాలయ ఆవరణలో వేడుకలు నిర్వహిస్తునట్లు తెలిపారు. అధికారులు, మండల ప్రజలు అధికసంఖ్యలో హాజరు కావాలని కోరారు.

జాతీయ జెండాల పంపిణీ

కల్వకుర్తిరూరల్: ప్రధాని నరేంద్రమోదీ పిలుపుమేరకు ఇంటింటిపై జాతీయ జెండా ఎగురవేయాలని బీజేపీ నాయకులు కోరారు. బుధవారం మండలంలోని మార్చాలలో విద్యార్థులకు, గ్రామస్తులకు బీజేవైఎం అసెంబ్లీ కోకన్వీనర్ రాజశేఖర్ జాతీయ జెండాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీను, శ్రీశైలం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంతో పాటు అప్పాయపల్లిలో బీజేపీ మండల అధ్యక్షుడు సలేశ్వరం జాతీయ జెండాను పంపిణీ చేశారు. జెండాలను ప్రతి ఇంటిపై ఎగురవేయాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పంటలకు సాగునీరు సరఫరా చేయాలి

కల్వకుర్తిరూరల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన కాల్వల్లోకి సాగునీరు సరఫరా చేయాలని బీజేపీ నాయకుడు రాంచంద్రారెడ్డి, నర్సిరెడ్డి, కృష్ణాగౌడ్‌లు డిమాండ్ చేశారు. బుధవారం కల్వకుర్తి ఎత్తిపోతల కాల్వలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాల్వల్లోకి నీరు వదిలి 20 రోజులు కావొస్తున్నా తక్కువ మోతాదులో నీరు పారడంతో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కాల్వలోకి నీటిని అధిక మోతాదుల వదలాలని పేర్కొన్నారు. శేఖర్ రెడ్డి, వీరాస్వామి, రాంభూపాల్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెంచు మహిళ మశమ్మపై దాడి అమానుషం



మశమ్మను పరామర్శిస్తున్న సీపీఐ నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ముక్కిడిగుండంలో ఆదివాసి చెంచుమహిళ మశమ్మపై దాడి అమానుషమని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వార్ల వెంకటయ్య పేర్కొన్నారు. బుధవారం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చెంచు మహిళ మశమ్మను పరామర్శించి మాట్లాడారు. గతంలో మొలచింతలపల్లి, మారేడుదిన్నె గ్రామంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ఐటీడీఏ అధికారులు వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. పోలీసులు పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. మశమ్మకు మెరుగైన వైద్యం అందించి, వారి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ మండల సీపీఐ కార్యదర్శి మర్యాద వెంకటయ్య, సీపీఐ జిల్లా నాయకులు మారేడు శివశంకర్, కపిలవాయి గోపిచారి తదితరులు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని సింగోటంలో నీరడ కృష్ణయ్య(60) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 12న కృష్ణయ్య మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య వల్లమ్మ మందలించింది. దీంతో ఇంటి వద్దనే పురుగు మందు తాగాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. 13న ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి చిన్న కుమారుడు రవి ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హృషికేష్ తెలియజేశారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



పెద్దకొత్తపల్లి: వెన్నచర్ల గ్రామానికి చెందిన యశ్వంత్‌కుమార్‌కు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి రూ.15 వేల చెక్కును బాధితుడి తల్లి శిరీషకు మాజీ ఎంపీటీసీ రవికుమార్ బుధవారం గ్రామంలో అందజేశారు. కార్యక్రమంలో పర్వతాలు, రాంప్రసాద్, రాముడు, రామకృష్ణ పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి ఆర్థిక సాయం

కల్వకుర్తిరూరల్: మండలంలోని పెద్దాపూర్‌లో నూతనంగా నిర్మించే పోచమ్మ దేవాలయ నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కాయతి ఆశాదీప్‌రెడ్డి రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. బుధవారం తాండ్ర గ్రామంలో ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. నిర్వాహకులు ఆశాదీప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు వెంకట్‌రెడ్డి, జయంత్‌రెడ్డి, యాదగిరి, మల్లికార్జున్, మల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు.

డీటీఎఫ్ సభ్యత్వ నమోదు



ఉప్పునుంతల: మండలంలోని జెడ్పీ సదగోడు పాఠశాలలో బుధవారం డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జక్కా రామస్వామి సభ్యత్వ నమోదు చేయించారు. ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై అధ్యయనం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రత్న ప్రసాద్, జానకిరాం, శంకర్ రాథోడ్, లక్ష్మీనారాయణ, జ్యోతి, భార్గవి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం గ్రామదేవతలకు పూజలు



వెల్దండ: మండలంలోని చెదురుపల్లిలో వర్షం కోసం గ్రామస్తులు బుధవారం గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు డప్పు వాద్యాలతో ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నీటితో అభిషేకం చేశారు. తీవ్ర వర్షాభావ పరిస్థితి వల్ల సాగుచేసిన పంటలు ఎండిపోతుండటంతో సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం సాయంత్రం వరదపాశం పోశారు. గ్రామపెద్దలు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

లావుని కమిటీలను పునరుద్ధరించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లాలో లావుని కమిటీలను పునరుద్ధరించాలని పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలివ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని నాగర్‌కర్నూల్ సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. భూములకు సంబంధించిన పట్టాలు లేక అర్హులైన వారికి బ్యాంకుల నుంచి రుణాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి తక్షణమే రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం రూ.12 వేల ఆర్థిక సాయం అందజేయాలన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చింత ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, భాస్కర్, బుచ్చన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం అందజేత



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామంలోని ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు బుధవారం కెనరా బ్యాంక్ అధికారులు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు రంజిత్‌కుమార్, విక్రమ్ మాట్లాడుతూ గతేడాది 5, 6, 7వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.3 వేలు, అదేవిధంగా 8, 9, 10వ తరగతి విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకం అందించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు, ఉపాధ్యాయులు రాజశేఖర్, వెంకటశైలం, కొండల్‌రెడ్డి, రాజు తదితరులు ఉన్నారు.

అధిక వడ్డీ ఆశచూపి మోసం చేసిన వ్యక్తికి రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: అధికవడ్డీ ఆశచూపి ప్రజలను మోసం చేసిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కనకయ్యగౌడ్ తెలిపారు. తెలకపల్లి మండలం నడిగడ్డకు చెందిన చోటేమియా నడిగడ్డతోపాటు తూడుకుర్తి గ్రామాల్లో దాదాపుగా 150మంది ప్రజలను అధిక వడ్డీ ఆశచూపి రూ.20కోట్లు వసూలు చేసిమోసం చేశాడు. బాధితు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన పానుగంటి బాలలక్ష్మయ్య, అతని కుమారుడు రవీందర్‌పై బుధవారం దాయాదులైన పానుగంటి అంజనేయులు, మల్లేష్‌లు దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. పొలంలో విషయంలో గొడవపడి కట్టెలు, గొడ్డలితో తమపై దాడి చేసి గాయపర్చినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

చారకొండ: మండల కేంద్రంలో సర్వే నెం 778లో భూమి వివాదంలో మండల కేంద్రానికి చెందిన వెంకటమ్మ, లక్ష్మయ్యలు ఘర్షణ పడ్డారు. ఈ మేరకు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇరువురిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎస్ఐ మహేందర్ తెలిపారు.

హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ



తిమ్మాజిపేటలో నినాదాలు చేస్తున్న హిందూ ధార్మిక సంస్థలు



కల్వకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

కల్వకుర్తిరూరల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు హత్యలు, అత్యాచారాలకు నిరసనగా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని హనుమాన్ దేవాలయం నుంచి మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హిందువులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించాలన్నారు. ఈ నెల 16న పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పరుమాల లక్ష్మీకాంత్ మాట్లాడుతూ హిందువులంతా సంఘటితమై దాడులను ఖండించాలన్నారు. కార్యక్రమంలో హిందూ సంఘాల ఐకేపీ కన్వీనర్ కిషోర్, రాజశేఖర్, లింగస్వామి, శేఖర్, రఘుపతిరెడ్డి, రాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ (బిజినేపల్లి): బంగ్లాదేశ్‌లో హిందువులపై, హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులకు నిరసనగా బుధవారం తిమ్మాజిపేటలో బంద్ పాటించారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలను మూయించారు. వ్యాపారులు బంద్‌లో పాల్గొన్నారు.

పద్మన్నపల్లిలో వైద్య శిబిరం ఏర్పాటు

తెలకపల్లి: మండలంలోని కార్వంగలో నేషనల్ ఆయుష్‌మిషన్ ఆధ్వర్యంలో 50 సంవత్సరాలు దాటిన వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. 100 మందికి పైగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ తెలిపారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య శిబిరం నోడల్ అధికారి డాక్టర్ గోపాల్, మంజుల, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని పద్మన్నపల్లిలో లింగాల సీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శివశంకర్ 50 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వీరిలో 30 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. నీటిని కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగడం, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బానుచందర్, ఏఎన్ఎం యాదాబాయి, ఎల్టీ మల్లేష్, ఆశకార్యకర్త జ్యోతి పాల్గొన్నారు.



పద్మన్నపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శివశంకర్